క్లుప్తంగా

ఆటలతో ఆరోగ్యం పదిలం



వనపర్తి టౌన్: ఆటలతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని మార్కెట్ కమిటీ చైర్మన్ బి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ధ్యాన్‌చంద్ జయంతి ఉత్సవాల్లో భాగంగా స్పోర్ట్స్ ఆథారిటీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు బాలుర కళాశాల మైదానంలో జిల్లా అధికారులకు వాలీబాల్, క్రికెట్, తగ్గఫర్ తదితర క్రీడా పోటీలు శుక్రవారం ముగిశాయి. ముఖ్య అతిథిగా హాజరైన మార్కెట్ కమిటీ చైర్మన్ బి.శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ఆటలతో ఆరోగ్యం, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. నిత్య జీవితంలో వ్యాయామం, క్రీడలకు కొంత సమయం కేటాయిస్తే శరీర, మానసిక ధృడత్వం పెరుగుతుందని తెలిపారు. విజేతలకు శాఖల అధికారులకు బహుమతులను ప్రదానం చేశారు. వాలీబాల్‌లో పోలీస్ శాఖ ఫస్ట్, సెకండ్ విద్యాశాఖ, క్రికెట్‌లో మొదటి విజేత పోస్టల్ డిపార్ట్‌మెంట్, రన్నరప్‌గా పోలీస్ శాఖ, తగ్గఫర్‌లో విజేతగా పోలీస్, రెండో స్థానంలో విద్యాశాఖ నిలిచాయి. కార్యక్రమంలో కౌన్సిలర్ బ్రహ్మం, డీవైఎస్‌ఓ సుధీర్‌కుమార్‌రెడ్డి, పీడీలు సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు కోళ్ల వెంకటేష్, శేఖర్, కీజర్‌బాబా, హాకీ అకాడమీ కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ వర్తక సంఘం కమిటీ ఎన్నిక



అమరచింత: పట్టణంలోని భక్త మార్కండేయ ఆలయ ఆవరణలో నిర్వహించిన వర్తక సంఘం సభ్యుల సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు వర్తక సంఘం ప్రధాన కార్యదర్శి తోకటి రమేష్ తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా ఆలంపల్లి ఈశ్వరయ్యశెట్టి, అధ్యక్షుడిగా తాటికొండ విజయ్, సహాయ కార్యదర్శిగా సలాం, బీసిరెడ్డి, కోశాధికారిగా చిన్ని రమేష్, అడ్వైజర్లుగా విజయ్, కలాం, వెంకటయ్య, సత్యనారాయణ నియమించారు. వీరితో పాటు సభ్యులుగా జనార్దన్‌శెట్టి, రాజశేఖర్‌శెట్టి, మాదన్న, జాల్గి నరసింహ, శంకర్ లింగం, తిమ్మారెడ్డి, వెంకటేష్, పారుపల్లి ఊశన్న తదితరులను ఎన్నుకున్నారు. పట్టణంలో జరిగే సామాజిక సేవ కార్యక్రమాల్లో తమ సంఘం ద్వారా సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

ప్లాట్లు కేటాయించాలి



వనపర్తి రూరల్: పెబ్బేరు నుంచి వనపర్తికి వెళ్లే రోడ్డు విస్తరణలో భాగంగా ఇల్లు, ప్లాట్లు కోల్పోయిన బాధితులకు ప్లాట్లు కేటాయించాలని శుక్రవారం రోడ్డు విస్తరణ బాధితులు పెబ్బేరు మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ ఎద్దుల కరుణశ్రీ, వైస్ చైర్మన్ కర్రె స్వామికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎల్లన్నగౌడ్, సదామణి, జనార్దన్‌గౌడ్, భారతి, స్వామి, శ్యాంలాల్, కృష్ణాజీ, సహదేవుడు, రాముడు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి



వనపర్తి: రైతుల సంక్షేమానికి కృషి చేస్తామని సింగిల్‌విండో అధ్యక్షుడు వెంకట్రావు అన్నారు. రైతు రుణమాఫీ అయిన రైతులకు శుక్రవారం రూ.70లక్షల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పోతులపల్లి రాజు, మాజీ చైర్మన్ తిరుమలయ్య, సీఈఓ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని నలుగురికి గాయాలు

వనపర్తి రూరల్: కొత్తకోట వైపు నుంచి ముగ్గురు వ్యక్తులు బైక్‌పై వస్తూ ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా.. ముగ్గురికి స్వల్ప గాయాలయిన ఘటన శుక్రవారం పెబ్బేరు సమీపంలోని ఎన్‌హెచ్44 రోడ్డుపై చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెబ్బేరు మున్సిపాలిటీలోని చెలిమిల్లకు చెందిన బీసన్న ఎన్‌హెచ్ 44 రోడ్డుపై బైక్‌పై రైట్ సైడ్ వెళ్తుండగా, వనపర్తి జిల్లా ఆత్మకూర్ పట్టణానికి చెందిన గోవిందు, రమేష్, బాలు ముగ్గురు వ్యక్తులు కలిసి బైక్‌పై పెబ్బేరుకు వస్తున్నారు. పెబ్బేరు పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఎన్‌హెచ్ 44 రోడ్డుపై బీసన్న బైక్‌ను ఎదురుగా ఢీకొట్టడంతో బీసన్నకు కాలు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. మరో బైక్ ఉన్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకొని బాధితులను వనపర్తి ఆస్పత్రికి తరలించారు. ఘటనపై బాధితుల నుంచి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు.

పారిశుద్ధ్య పనుల్లో అలసత్వం వద్దు



సింగంపేటలో పాత టైర్‌లో నిలిచిన నీటిని పారబోయిస్తున్న డీపీఓ రమణమూర్తి

అమరచింత: పారిశుద్ధ్య పనుల్లో అలసత్వం చూపితే శాఖాపరమైన చర్యలు తప్పవని డీపీఓ రమణమూర్తి అన్నారు. మండలంలోని సింగంపేటలో శుక్రవారం చేపట్టిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు అధికంగా ఉంటాయని, వీటిని నివారించే పనుల్లో పంచాయతీ కార్యదర్శులు ముందుండాలన్నారు. డ్రెయినేజీలను నిత్యం శుభ్రం చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంపీఓ నరసింహులు, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సహకరించాలి

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని, పరిసరాల శుభ్రత కోసం ప్రజలు సహకరించాలని మున్సిపల్ ప్రత్యేక అధికారి మత్స్యశాఖ ఏడీ లక్ష్మప్ప, చైర్‌పర్సన్ మంగమ్మ అన్నారు. పట్టణంలోని ఏడో వార్డులో పర్యటించి ఏపుగా పెరుగుతున్న గడ్డి మొక్కలను తొలగించడం, రహదారిపై నిలిచిన వర్షపు నీటిని మళ్లించడం వంటి పనులను మున్సిపల్ కార్మికులతో చేయించారు. రహదారిపై ఉన్న గుంతలను మొరం మట్టితో కప్పి ఉంచారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నురుల్‌నదీం, ఆరోగ్య శాఖ సిబ్బంది, మెప్మా, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టడంలో నిర్లక్ష్యం వహిస్తే అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, విధుల్లో నిర్లక్ష్యం వహించే వైద్య సిబ్బంది, పంచాయతీ వర్కర్లపై చర్యలు తీసుకుంటామని మండల స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఎంపీడీఓ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండలంలోని సంగినేనిపల్లి, తూంకుంట, బొల్లారం తదితర గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

వనపర్తి రూరల్: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు తగు జాగ్రతలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారిణి సుషిత అన్నారు. శుక్రవారం ఆమె శ్రీరంగాపురం మండలంలోని కంభాళాపురంలో పర్యటించారు. గ్రామంలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సిబ్బందికి, ప్రజలకు సూచించారు.

వనపర్తి మండలంలో..

మండలంలోని పెద్దగూడెంతండాలో ఎంపీడీఓ రాఘవ ఇంటింటికీ తిరుగుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలని గ్రామ ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి మదిలేటి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూర్: పట్టణంలోని 6వ వార్డుతో పాటు మండలంలోని గ్రామాల్లో ముమ్మరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి, మండల ప్రత్యేకాధికారి బీరం సుబ్బారెడ్డి, తహసీల్దార్ రాజు, ఎంపీఓ శ్రీరాంరెడ్డి,చైర్‌పర్సన్ గాయత్రి, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు తదితరులు ఉన్నారు.

ఖిల్లాఘనపురం: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటాచారి, అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సంగినేనిపల్లిలో పారిశుద్ధ్య పనులు పర్యవేక్షిస్తున్న మండల ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ



కంభాళాపురంలో పారిశుద్ధ్య పనులు పర్యవేక్షిస్తున్న ప్రత్యేక అధికారి



పెద్దగూడెం తండాలో..

కుటుంబ నిర్ధారణకు ధ్రువీకరణ తప్పనిసరి



పాన్‌గల్ రైతువేదికలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఈఓలు

పాన్‌గల్: రేషన్ కార్డులు లేని రైతులకు రుణమాఫీ విషయంలో కుటుంబ నిర్ధారణకు కుటుంబ సభ్యులు ధ్రువీకరణ తప్పనిసరిగా అందించాలని ఏఓ, నోడల్ అధికారి సాజిద్‌రహమాన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో కుటుంబ నిర్ధారణకు సంబంధించి రైతుల నుంచి ధ్రువీకరణ పత్రాలను ఆయన స్వీకరించారు. కుటుంబ నిర్ధారణకు సంబంధించి మండలంలో 432 మంది ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. దీంతో పాటు మండల కేంద్రంలోని రైతువేదికలో రుణమాఫీ వర్తించని రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణను వివిధ గ్రామాలకు చెందిన ఏఈఓలు అందుబాటులో ఉండి ఆయా గ్రామాలకు సంబంధించిన రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.

వీపనగండ్ల: రూ. 2లక్షల లోపు రుణమాఫీకి అర్హత ఉండి రుణాలు మాఫీ కాని రైతులు ప్రభుత్వం కల్పించిన ప్రత్యేక నమోదు కార్యక్రమంలో స్వయంగా పాల్గొని రుణమాఫీని సద్వినియోగం చేసుకోవాలని వీపనగండ్ల క్లస్టర్ ఏఈఓ రజిత రైతులకు విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రంలోని 78 మంది రైతులు రుణమాఫీకి అర్హత ఉండి వివిధ కారణాల వల్ల మాఫీ జరగలేదని అలాంటి రైతులు శనివారం, సోమవారం రోజుల్లో స్వయాన రైతువేదిక వద్దకు వచ్చి అవసరమైన ధ్రువపత్రాలతో పాటు ఆన్‌లైన్ యాప్‌లో రైతుల ఫొటోలు నమోదు చేయించుకోవాలని ఆమె కోరారు.

అమరచింత: రుణమాఫీ కాని రైతుల వివరాలతో పాటు ఒకే రేషన్ కార్డు కలిగిన రైతుల వివరాలను సేకరించే కార్యక్రమం మండలంలో కొనసాగుతుంది. మండలంలోని మిట్టనందిమళ్ల, చింతరెడ్డిపల్లిలో ఏఓ అరవింద్‌తో పాటు ఏఈఓలు రైతుల కుటుంబ సభ్యుల వివరాలను విచారించి నమోదు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట సీఐగా కృష్ణయ్య



కొత్తకోట రూరల్: కొత్తకోట సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కృష్ణయ్య శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన సీఐ రాంబాబు హైదరాబాద్ ఐజీ ఆఫీస్‌లో రిపోర్ట్ చేయనున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ఐజీ కార్యాలయంలో ఉన్న కృష్ణయ్య కొత్తకోట సీఐగా బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు పనిచేసిన సీఐ శ్రీనివాస్‌రెడ్డి దీర్ఘకాలిక సెలవుల్లో వెళ్లడంతో 2024 జనవరి 31న కేఎస్ రత్నం సీఐగా బాధ్యతలు చేపట్టి మార్చి 6న బదిలీపై వెళ్లాడు. అనంతరం ఆయన స్థానంలో సీఐగా రాంబాబు బాధ్యతలు చేపట్టారు. ఆరు నెలలు కూడా గడవక ముందే ఆయన్ను బదిలీ చేయడం.. ఏడాది కాలంలోనే ముగ్గురు సీఐలు మారడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

బస్సు సౌకర్యం కల్పించాలని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు

వీపనగండ్ల: తమ గ్రామాలకు బస్సు వసతిని కల్పించాలని కోరుతూ శుక్రవారం గోవర్ధనగిరిలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. కరోనా సమయంలో గోవర్ధనగిరి, గోపల్దిన్నె గ్రామాల మీదుగా మండల కేంద్రానికి వెళ్లే ఆర్టీసీ బస్సులను అధికారులు రద్దు చేసి నేటికీ పునరుద్ధరించలేదని సీపీఎం మండల నాయకులు మహెబూబ్ పాష, నిరంజన్, ఖాజాఉస్సేన్ అన్నారు. బస్సు వసతి కల్పించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని, కొల్లాపూర్, వనపర్తి డిపో అధికారుల నిర్లక్ష్యం వల్ల మండల కేంద్రానికి వెళ్లాలంటే 8 కిలోమీటర్లు నడవాల్సి వస్తుందని వాపోయారు. రాస్తారోకో కార్యక్రమంతో దాదాపు రెండు గంటల పాటు బస్సులు, ప్రైవేట్ వాహనాలు నిలిచిపోయాయి. కార్యక్రమంలో రవిప్రసాద్, కిరణ్, శ్రీనివాసులు, వెంకట్‌స్వామి, కృష్ణయ్య, అహ్మద్ పాల్గొన్నారు.

నేడు మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

మదనాపురం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో శనివారం మండల స్థాయి జిల్లా పరిషత్ పాఠశాలల విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రధాన ఉపాధ్యాయులు మద్దిలేటి తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని ఆయన చెప్పారు. మదనాపురం, దుప్పల్లి, అజ్జకొల్లు, కొన్నూరు పాఠశాల విద్యార్థులు పాల్గొంటారని వెల్లడించారు.

‘ఖిల్లా’ ఎస్‌ఐ బదిలీ

ఖిల్లాఘనపురం: స్థానిక ఎస్‌ఐ శ్రీహరి బదిలీపై వెళ్లారు. 2023 ఫిబ్రవరిలో ఖిల్లాఘనపురం ఎస్‌ఐగా బాధ్యతలు తీసుకున్న ఆయనను శుక్రవారం మహబూబ్‌నగర్ వీఆర్‌కు ప్రభుత్వం బదిలీ చేసింది. మండలానికి ఇన్‌చార్జ్ ఎస్‌ఐగా నరేష్ శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఆయన స్టేషన్ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

కొత్తకోట రూరల్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు యువకుల కుటుంబాలకు అండగా ఉంటానని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి భరోసానిచ్చారు. పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లికి చెందిన యువకులు బోయ అశోక్, బోయ చందు ఈనెల 28న రోడ్డు ప్రమాదంలో మరణించారు. స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి శుక్రవారం పామిరెడ్డిపల్లికి చేరుకుని బాధిత కుటుంబాలను పరామర్శించారు. అనంతరం తక్షణ సాయంగా ఒక్కొక్కరికి రూ.25వేలు చొప్పున అందజేశారు. ఎమ్మెల్యే వెంట వనపర్తి మార్కెట్ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ రఘుప్రసాద్, నాయకులు శ్రీశైలం, రఘుగౌడ్, తిక్కన్న, చందు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ భగవానుడి ఊరేగింపు



వనపర్తిలో కృష్ణుడి ప్రతిమ ఊరేగింపు చేస్తున్న భక్తులు

వనపర్తిటౌన్: శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా శుక్రవారం త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శ్రీకృష్ణ భగవానుడి అష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీకృష్ణ బోధనలు వివరిస్తూ, సామూహిక భజనలు, కోలాట నృత్యాలతో ఊరేగింపును పట్టణ పురవీధుల గుండా ఊరేగించారు. శ్రీకృష్ణ భగవానుడి దర్శించుకునేందుకు భక్తులు ప్రధానదారుల గుండా బారులు తీరారు. ప్రతి కూడలిలో ప్రత్యేకంగా ప్రదర్శించిన కోలాట, నృత్య, భజన కీర్తనలు చూపరులను అలరించాయి. కార్యక్రమంలో వెంకట్రాములు, సభ్యులు బాలయ్య, బాలకృష్ణ, సురేష్‌కుమార్, కృష్ణయ్య, బద్రి నారాయణ, ఆంజనేయులు, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీరంగాపురం మండలంలోని నాగరాల, పెబ్బేరు మండలంలోని రంగాపురంలో శ్రీ కృష్ణ భగవానుడిని ప్రతిమను ఊరేగింపు చేశారు. స్వామివారి పల్లకీ సేవలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్, నరేందర్‌రెడ్డి, ఉత్సవ కమిటీ అధ్యక్షులు కృష్ణయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రేమద్దులతో ఇంటింటి జ్వర సర్వే



పాన్‌గల్: మండలంలోని రేమద్దులలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం డెంగీ జ్వర అనుమానితులపై ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశానుసారం గ్రామంలో డెంగీ జ్వర అనుమానితులకు సంబంధించి 55 గృహాల్లో సర్వే చేసి 24 మంది నుంచి రక్త నమూనాలను సేకరించినట్లు ఆయన పేర్కొన్నారు. ఆయా గృహాల్లో దోమల సంహారిని పైరిత్రం మందును పిచికారీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గోవింద్‌రావు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక అంశాలపై అవగాహన

ఎర్రవల్లి: మండలంలోని సాసనూలు గ్రామంలో కోదండాపురం పీఎస్ ఆధ్వర్యంలో సామాజిక అంశాలతో పాటు పోలీస్ చట్టాలపై కళాబృందం సభ్యులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ స్వాతి ప్రజలకు ఆపదలో ఉపయోగపడే డయల్–100, రోడ్డు సేఫ్టీ, సైబర్ క్రైమ్, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలు, పోక్సో కేసుల పర్యవసానాలు, సీసీ కెమెరాల ఉపయోగంతో పాటు రైతులకు వివిధ ఆర్థిక అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు ఉన్నారు.

‘సంపూర్ణ మద్యపాన నిషేధం పాటిస్తాం’



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లిలో సంపూర్ణ మద్యపాన నిషేధం పాటించడంతో పాటు ఆర్‌అండ్‌బీ రోడ్డుపై చికెన్ విక్రయాలు నిషేధించాలని గ్రామస్తులు నిర్ణయించుకున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం సమావేశమైన గ్రామ పెద్దలు, ప్రజలు ఈ మేరకు తీర్మానం చేశారు. గ్రామంలో రెండు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి ఇద్దరు యువకులు మరణించారు. దీనికి కారణం గ్రామంలో విచ్చలవిడిగా మద్యం అందుబాటులో ఉండడం, చికెన్ షాపుల వద్ద ఉండే కుక్కలు రోడ్డుకు అడ్డంగా రావడం, మోటార్ సైకిళ్లు, కార్లను రోడ్డుపైనే నిలుపుతుండడంతో వాటిని తప్పించబోయి వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారని మండిపడ్డారు. ఈ మేరకు పంచాయతీ సెక్రెటరీ జయమ్మకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మన్నెపురెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, భీంరెడ్డి, పాపిరెడ్డి, శ్రీశైలం, నాగేంద్రం, శివాజీరావు, కావలి వెంకట్రాములు, సందడి బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరికి వెండి కవచం అలంకరణ



వెండి కవచాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న ఆర్యవైశ్య మహిళలు

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి వెండి కవచ అలంకరణ మహోత్సవాన్ని ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని ముగ్గురు అమ్మవార్లకు పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, దాదాపు 20కిలోల వెండితో చేసిన స్వర్ణ కవచాలను అమ్మవార్లకు ప్రత్యేక పూజల అనంతరం అలంకరించారు. అమ్మవారికి ఎంతో ప్రీతిప్రాయమైన అరుదుగా లభించే కదంభ పుష్పాలు, కలువ పూలచే అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి వచ్చిన వారు వాసవీ మాత సహిత, అష్టలక్ష్మి మండపాలను రకరకాల పుష్పాలచే అలంకరించారు. కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి సతీమణి కవిత, ఆర్యవైశ్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గుంత మౌనిక, విశ్వనాథం వెంకటరమణ, కొత్తకోట ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గుంత సురేష్, కొండ స్వప్న, గుంత మల్లేష్, బాలకృష్ణ, నరేష్, అనిత తదితరులు ఉన్నారు.

‘కష్టపడే ఉపాధ్యాయులను ప్రజలు మరువరు’

వనపర్తిటౌన్: పాఠశాలలో విద్యార్థులకు బోధించిన అంశాలు, నేర్పిన విషయాలను తిరిగి వారి నుంచి రాబట్టగలిగిన ఉపాధ్యాయులే ఉత్తములని ఇన్‌చార్జ్ డీఈఓ గోవిందరాజులు అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని హరిజనవాడ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు బి.సులోచన ఉద్యోగ విరమణ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆయనతోపాటు మాజీ జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. వృత్తి ధర్మాన్ని చిత్తశుద్ధితో నిర్వర్తిస్తూ విద్యార్థుల కోసం కష్టపడే ఉపాధ్యాయులను ప్రజలు ఎప్పటికీ మరచిపోరని తెలిపారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని.. ఉద్యోగ జీవితంలో వారి ప్రగతికి అనుక్షణం పాటుపడాలని ఆకాంక్షించారు. అనంతరం అతిథులు, పాఠశాల సిబ్బంది సులోచన దంపతులను శాలువాలు, జ్ఞాపికలతో సన్మానించారు. సులోచన కుటుంబ సభ్యులు రూ.30 వేల విలువగల ప్రింటర్‌ను పాఠశాలకు బహూకరించారు. కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి చంద్రశేఖర్, ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు మద్దిలేటి, కార్యదర్శి గణేష్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు రమాకాంత్, శంకర్‌గౌడ్, వరలక్ష్మి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, నారాయణ రెడ్డి, అనురాధ, విజయ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘం నాయకులు మహిపాల్‌రెడ్డి, హరిప్రసాద్, అమరేందర్‌రెడ్డి, శశి పాల్గొన్నారు.

నేడు అడవి హనుమాన్ ఆలయంలో సప్తాంగ పూజలు

అమరచింత: శ్రావణ మాసం చివరి శనివారాన్ని పురస్కరించుకుని మండలంలోని అడవి హనుమాన్ ఆలయంలో సప్తాంగ పూజలు నిర్వహిస్తున్నామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఏడాది శ్రావణ మాసంలో క్రమం తప్పకుండా ప్రత్యేక పూజలు చేపడుతున్నట్లు వారు పేర్కొన్నారు. శనివారం తెల్లవారుజామున స్వామివారి మూల విరాట్‌ను పవిత్ర నదీ జలాలతో అభిషేకించనున్నారు. పూజల్లో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్ హాజరవుతున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి సేవలో తరించాలని కమిటీ సభ్యులు కోరారు.

సంత్ సేవలాల్ మహారాజ్ భవనం మంజూరు చేయాలి

ఖిల్లాఘనపురం: మండలంలోని రోడ్డుమీదితండాలో నూతనంగా శ్రీసంత్ మహారాజ్ సేవాలాల్ భవనం నిర్మించాలని కోరుతూ శుక్రవారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి తండావాసులు వినతి పత్రం ఇచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించడంతో పాటుగా త్వరలోనే భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తూ ప్రొసీడింగ్ కాపీ అందిస్తానని హామీ ఇచ్చారని గిరిజనులు హర్యానాయక్, రవినాయక్, నానునాయక్ తెలిపారు. మండలంలో అవసరమైన అన్ని గిరిజన తండాల్లో సంత్ మహారాజ్ సేవాలాల్ భవనాలు నిర్మించేందుకు కృషిచేస్తామని చెప్పినట్లు వారు తెలిపారు. నిధులు మంజూరుకు ముందుకు వచ్చిన ఎమ్మెల్యే, అందుకు కృషి చేసిన సాయిచరణ్‌రెడ్డికి ఈ సందర్భంగా తండావాసుల కృతజ్ఞతలు తెలిపారు.

భవన నిర్మాణ రంగ కార్మికులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న ప్రసాద్

ఆత్మకూర్: భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, ఇన్సూరెన్స్ అమలును ఎల్ఐసీకి అప్పగించాలనే నిర్ణయం వెనక్కి తీసుకోవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని జూరాలలో భవన నిర్మాన కార్మికులతో సమావేశమయ్యారు. కార్మికులకు సంక్షేమ బోర్డు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, ప్రమాద బీమా రుసుమును రూ.10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొండన్న, కృష్ణ, ఖాసీం, దస్తగిరి, రాములు, పరశురాముడు, బాలస్వామి, సత్యన్న, మహేష్, శ్రీను, మద్దిలేటి, సాయిలు ఉన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

పెంట్లవెల్లి: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రామన్ గౌడ్ హెచ్చరించారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు సక్రమంగా ఉంచుకోవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగొద్దన్నారు. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.